క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో విచారణలు జరపాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: సాగరమాల భూసేకరణలో కొన్ని ప్రాంతాల్లో రికార్డులు సక్రమంగా లేక యజమానులను గుర్తింపునకు ఇబ్బందిగా మారిందని, దీనిపై వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ సూచించారు. గురువారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో సాగరమాల ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని భూములకు సంబంధించి పత్రాలను సేకరించడంతోపాటు ఆ భూమికి వారసులు ఎవరు, వారి వద్ద నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేవన్న అఫిడవిట్‌లు సేకరించాలన్నారు. అలాగే ముత్యాలపాడులో కొంత మంది రైతులు రెండో పంట సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై స్థానిక వీఆర్వో రైతులతో మాట్లాడాలని తెలిపారు. ఈ సమీక్షలో ఆర్ఐ రమ్యస్వాతి, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యకు 416 దరఖాస్తులు

కోట: మిషన్ వాత్సల్య పథకానికి కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 416 మంది దరఖాస్తు చేసుకున్నారని సీడీపీఓ మునికుమారి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు కోల్పోయిన, కన్నవారు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు ఈ పథకం కింద నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ పథకంపై విస్తృత ప్రచారం చేయడంతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఉన్నతాధికారులకు పంపామన్నారు. మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇంకా ఉందన్నారు.

కామిరెడ్డికి ఎమ్మెల్యే కిలివేటి పరామర్శ

నాయుడుపేటటౌన్: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం సరిలేక ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండడంతో ఎమ్మెల్యే పట్టణంలోని అర్జునగంనగర్‌లోని రాజారెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట చైర్ పర్సన్ దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి ఉన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

చిల్లకూరు: ఆర్టీసీ బస్సును లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు బయలు దేరింది. మార్గం మధ్యలోని మనుబోలు వద్ద వెనుక వస్తున్న ఓ లారీ, బస్సును ఢీకొంది. దీంతో బస్సు దెబ్బ తింది. బస్సు డ్రైవర్ లారీని ఆపే ప్రయత్నం చేయగా లారీని రోడ్డుపైనే ఆపి, డ్రైవర్ పరారయ్యాడు. దీంతో డ్రైవర్ బస్సును తీసుకుని గూడూరు డిపోకు వెళ్లి ప్రమాద సమాచారాన్ని అధికారులకు అందజేశాడు. తిరిగి సూళ్లూరుపేటకు వెళ్లడానికి చిల్లకూరు సమీపంలోకి వచ్చే సరికే అదే లారీ మరో సారి బస్సును ఢీ కొంది. దీంతో బస్సు డ్రైవర్, కండక్టర్లు లారీని ఆపగా మరోసారి లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో బస్సు డ్రైవర్ చిల్లకూరు పోలీస్ స్టేషన్ వద్ద బస్సు ఆపి, లారీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనల్లో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

వైభవంగా విగ్రహప్రతిష్ఠ

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి హోమాలు, అభిషేకాలు చేశారు. కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని, పూజలు చేశారు. ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ధనమ్మ, నాయకులు గుడ్ల వెంకటరెడ్డి, జరుగుమల్లి బాబురెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బచ్చల రవీంద్రర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్ బాషా, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కోట: మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కోట బజారువీధిలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు. దళితవాడ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న మూడు సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో వాకాడు సీఐ హరికృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ భవానీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్చరిక.. కబ్జాదారులకో లెక్కా!





నెలబల్లి సమీపంలోని ఆక్రమణ భూమిలో వారం కిందట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు. నేడు కనిపించని బోర్డు.. చదును చేసిన స్థలం

అది తెలుగుగంగ, జాతీయ రహదారికి చెందిన స్థలం. రూ.కోట్ల విలువ చేస్తుంది. దీనిపై కబ్జాదారుల కన్ను పడింది. ఆ భూమిని ఆక్రమించారు. విషయం తెలుసుకున్న అధికారులు ఇది ప్రభుత్వ స్థలం.. ఇందులో ఎవరు అడుగుపెట్టకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డు పెడితే మాకేమీ..అన్నట్లు కబ్జాదారులు బోర్డులను తొలగించారు.. తమ పని తాము చేసుకుని, ఆ భూమిలో మట్టి తోలి చదును చేశారు.

- బోర్డులు తొలగింపు
- యథావిధిగా రాత్రికి రాత్రే పనులు

దొరవారిసత్రం: ఆక్రమణ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించి, మళ్లీ ఆ భూమిని చదును చేసిన సంఘటన దొరవారిసత్రం మండలం నెలబల్లిలో గురువారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. నెలబల్లి గ్రామ పరిధిలోని తెలుగుగంగ ఏడో బ్రాంచి కాలువకు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమణ దారులు రాత్రికి రాత్రే మట్టి తోలి ఆక్రమించారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'రాత్రికి రాత్రే చదును' అనే శీర్షిక గత నెలలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన తెలుగుగంగ అధికారులు, రెవెన్యూ అధికారులు ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఆక్రమణదారులు తొలగించి, మట్టి తోలి రాత్రికి రాత్రే చదును చేసిన ఘటన వెలుగు చూసింది. ఆక్రమణదారులు తొలుత గంగ కాలువ లైనింగ్‌ను ధ్వంసం చేసి, కొంత భూమిని ఆక్రమించారు. తరువాత రహదారికి చెందిన భూమితోపాటు నెలబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 19లో సుమారు ఎకరా భూమిని ఆక్రమించి చదును చేసే పనులు చేపట్టారు. ఈ తంతు రహదారి పక్కనే జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప, పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టలేని స్థితిలో ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు అక్రమిత భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలిగించి పనులు చేస్తున్నారంటే ఆక్రమణదారులకు ఎవరి అండదండలు ఉన్నాయని, వారి ధైర్యం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

నెలబల్లి వద్ద ఆక్రమణకు గురైన భూమిలో హెచ్చరిక బోర్డులు తొలిగింపుపై విచారించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను కూడా ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం.

– గోపీనాథ్‌రెడ్డి, తహసీల్దార్, దొరవారిసత్రం

తొలగింపుపై ఫిర్యాదు చేశాం

తెలుగు గంగ కాలువ లైనింగ్ ధ్వంసం చేసి, ఆక్రమించిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వీటి తొలగింపుపై డీవీ సత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. కానీ వారు ఇప్పటి వరకు ఏ చర్యలు తీసుకోలేదు. ఆ విషయం గురించి పట్టించుకోలేదు.

– శ్రీకాంత్, ఏఈ, తెలుగు గంగ, దొరవారిసత్రం

పల్లె ముంగిటకే పాలన ఘనత జగనన్నదే



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థతో పల్లె ముంగిటకే పరిపాలనను తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని బజారు వీధి బాపూజీ వీధి, పార్కువీధి, కచ్చేరివీధిలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.కోటి వ్యయం చేసి బాపూజీవీధిని బాగు చేశామని, అదే తరహాలో పార్కు వీధి, కచ్చేరివీధి రోడ్లును కూడా వెడల్పు చేసి, అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వంలో సంక్షేమం ఎంత ముఖ్యమో అభివృద్ధి కూడా అంతే ముఖ్యంగా భావించి పనులు చేస్తున్నామని చెప్పారు. గడప గడపకు వెళుతుంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు మారుమోగుతోందని, దీంతో మరో సారి విజయం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరేంద్రకుమార్, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చిన్న సత్యనారాయణ పోలూరు పద్మ మిల్లన్, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, పొన్నా మునిప్రసాద్, పముజుల విజయలక్ష్మి, పేర్నాటి లక్ష్మీదేవి, ఉమ్మిటి రమ్య, సన్నారెడ్డి సౌజన్య, బందిల మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు మాయం



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు పంచాయతీ పరిధిలో పలు అక్రమ లేఅవుట్లలో స్థానిక సర్పంచ్ కుమారి కల్పన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. పంచాయతీ పాలకవర్గం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కొందరు రియల్టర్లు గుట్టు చప్పుడు కాకుండా హెచ్చరిక బోర్డులు తొలగించడంపై గ్రామంలో అలజడి నెలకొంది. దీంతో గురువారం గ్రామస్తులు స్థానిక సచివాలయానికి చేరుకుని అక్కడి అధికారులకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో వెంచర్లు వేసిన యాజమాన్యం గ్రామానికి ఇవ్వాల్సిన పది శాతం భూమి ఇవ్వలేదని, తద్వారా రూ.కోట్లు పంచాయతీకి నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి చేతివాటంతోనే పంచాయతీ ఆదాయానికి గండి పడుతుందని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గిలకపాడు, గండూరుపల్లెలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తుండడంతో ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. ప్రజలు ఆధార్‌కార్డు, పింఛన్, విద్యాదీవెన చిన్న చిన్న సమస్యలు తమకు తెలియజేయడం, వాటిని అక్కడికక్కడే అధికారులు పరిష్కరించడంతో ప్రజలు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దేశ చరిత్రలో తాము మంచి చేశామని, అవి మీకు చేరాయా? మీరు సంతృప్తికరంగా ఉన్నారా? లేదా అని తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇక్కడ పరిష్కారం కాని సమస్యలను 1902 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేసేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేశారని, ప్రజలు విటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకురెడ్డి, భాస్కర్‌రాజు, ఎంపీటీసీ సభ్యురాలు సింధు, అంకమరాజు, మురళీమోహన్‌రెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రాపూరు: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు వస్తున్న విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థుల్లో పఠనాశక్తి, సృజనాత్మక విలువలను పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ క్రిష్టియానా జెమ్స్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో ఎస్టీలకు 31, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1 సీటు ఉన్నాయన్నారు. నాలుగో తరగతి 36 సీట్లు, ఐదో తరగతిలో 33 సీట్లు, ఆరో తరగతిలో 33 సీట్లు , ఏడో తరగతి లో 4 సీట్లు, ఎనిమిదో తరగతిలో 8, తొమ్మిదో తరగతి 15 సీట్లు ఉన్నాయని తెలిపారు.

రాజీ మార్గంలో పరిష్కరించుకోండి

వెంకటగిరి: స్థానిక బీఎస్ఎన్ఎల్ బిల్లు పెండింగ్ సమస్యలున్న వినియోగదారులు రాజీ మార్గంలో వాటిని పరిష్కరించుకోవాలని ఆ సంస్థ డీఈ కె నాగారాజు, ఏఓ నాగేశ్వరరావు, జేటీఓ కామేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీన వెంకటగిరి కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ జరగనుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు పంచాయతీలో ఈ నెల 12, 13 తేదీల్లో మధ్యాహ్నం 3.00 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కరిముల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



మాట్లాడుతున్న డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి

వెంకటగిరి: పదోతరగతి సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపి, పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గూడూరు డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్‌స్కూల్, ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతి రోజూ 4 గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సప్లమెంటరీ పరీక్షల్లో పాసైన విద్యార్థులను సైతం రెగ్యులర్‌గా పాస్ అయినట్టు పరిగణించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, మరింత కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం నాడు -నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో పనులను పరిశీలించి, త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి వెంకటేశ్వర్లు, వల్లభదాస్, హెచ్ఎంలు తులసిజ్యోతి, జి భాస్కర్‌రెడ్డి, వాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్య సున్నితం.. పరిష్కారం ఆమోదయోగ్యం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: రామాలయం నిర్మాణానికి భూమిపూజ సమయంలో తలెత్తిన సున్నితమైన సమస్యకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నివాసంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. నాలుగురోజుల క్రితం కోళ్లఫారమ్ సెంటర్ వ ద్ద రామాలయ నిర్మాణానికి ఆ ప్రాంతవాసులు అ భ్యంతరం తెలిపిన క్రమంలో ఇరువర్గాలతో చర్చించి, ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా పరిష్కారం చూపామని తెలిపారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పెరియవరం సర్వే నంబర్ 137లో ఉన్న 35 సెంట్లు ప్రభు త్వ భూమిలో రామాలయం నిర్మాణానికి వారు కోరిన 1.5 సెంట్లు కంటే ఎక్కువగా 2 సెంట్లు కేటాయించినట్లు తెలిపారు. మరో వర్గం కోరిన విధంగా అంగన్‌వాడీ కేంద్రానికి దారి, ఓవర్‌హెడ్ ట్యాంక్, మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఆ ప్రాంతవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య, తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ పనులు పరిశీలన

వైఎస్సార్ సీపీ కార్యాలయ నిర్మాణ పనులను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి డీఎస్పీతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం స్థానికులు ఇచ్చిన అర్జీలను స్వీకరించి, సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నేతలు పి దశరథరామిరెడ్డి, కార్తీక్ రెడ్డి, బండి రమేష్‌రెడ్డి, పులిప్రసాద్‌రెడ్డి నెలబల్లి రామణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దశరథరామిరెడ్డి

దక్కిలి: స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడిగా మాదిరెడ్డి దశరథరామిరెడ్డి, డైరెక్టర్లుగా సుదర్శనమ్మ స్థానిక సొసైటీ కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులందరికీ తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు, డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి మునిరత్నం రెడ్డి, వై మనిరత్నం, వెంకటస్వామి, దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మురళీరెడ్డి, సొసైటీ సీఈఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనింగ్ భూముల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు, తురిమెర్ల మధ్యలో ఉన్న మైనింగ్ భూములను గురువారం మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ భూములకు సంబంధించిన పలు రికార్డులను క్షేత్ర స్థాయిలోఅధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, తహసీల్దార్ విజయలక్ష్మి, జిల్లా మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సూళ్లూరుపేట: వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సీఐ జానకిరామ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో 33 కేసుల్లో అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి, 504 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆవరణలోనే దానిని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. 499 క్వార్టర్, 5 ఫుల్ బాటిళ్లు ఉన్నాయన్నారు. దీని విలువ సుమారు రూ.72 వేలు ఉంటుందని తెలిపారు.

సిలికా తవ్వకాలపై తనిఖీలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని సిలికా గనుల్లో తవ్వకాలను గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ గనుశాఖ అధికారులతో కలసి తనిఖీ చేశారు. సిలికా తవ్వకాలకు సంబంధించి పలు ఆరోపణలు వస్తున్న క్రమంలో తవ్వకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గనులు లీజులు పొందిన వారి నుంచి వివరాలు అడగడంతోపాటు గనులశాఖ అధికారుల నుంచి వివరాలను రాబట్టారు. రామారెడ్డిపాళెంలోని సిలికా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి ఎంత మేర సిలికాను తరలిస్తున్నారన్న విషయాలను గుర్తించారు. ఆయన వెంట గనులశాఖాధికారులు, రూరల్ సీఐ దశరథరామారావు, తదితరులు ఉన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్

గూడూరు: భారతీయ జనతా పార్టీ యువమోర్చా తిరుపతి పార్లమెంటరీ జిల్ల ప్రధాన కార్యదర్శిగా గిద్దలూరు మనోజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్ ఆధ్వర్యంలో బీజేపీ తిరుపతి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి సహకారంతో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి



అద్దెపూడిలో రీసర్వేని పరిశీలిస్తున్న అధికారులు

చిట్టమూరు: మండలంలో రెండో విడత భూ రీసర్వే వేగవంతం చేయాలని గూడూరు డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ మునస్వామి అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులతో రీసర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడత భూ రీసర్వేలో గూడూరు డివిజన్‌లో చిట్టమూరు మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. మొదటి విడతలో 8 గ్రామాల్లో సర్వే త్వరగా పూర్తి చేశారన్నారు. రెండో విడతగా 14 గ్రామాల్లో సర్వే ప్రారంభించామన్నారు. అనంతరం గునపాడు, అద్దెపూడి, జంగాలపల్లె గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐలు మధులత, నిరంజన్, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.